నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం


విద్యుత్ సిబ్బందితో హబ్సీగూడ ఎస్ఈ కె.రాములు

కుషాయిగూడ: వేసవిలో నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా పనిచేయాలని హబ్సీగూడ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.రాములు అన్నారు. చర్లపల్లి సబ్ డివిజన్ కార్యాలయంలో గురువారం ఆయన సైనిక్‌పురి డివిజన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్ వివరాలను వారికి వివరించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుందనే అంచనాలతో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మెయింటెనెన్స్, ఓవర్‌లోడ్ అంశాలను సమన్వయం చేసేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలిగినా తమ దృష్టికి తీసుకువస్తే తక్షణ పరిష్కారం చూపేందుకు అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. విద్యుత్ అంతరాయానికి కింది నంబర్లలో అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.

సైనిక్ సబ్ డివిజన్ పరిధిలో..
కుషాయిగూడ ఏఈ రామకృష్ణ ఫోన్: 94901 53550
సైనిక్‌పురి ఏఈ పి.నరేందర్ 9490153548
యాప్రాల్ ఏఈ టి.సృజన్‌కుమార్ 9490153555

ఏఎస్‌రావునగర్ సబ్ డివిజన్ పరిధిలో..
ఏఎస్‌రావునగర్ ఏఈ సీహెచ్.అర్చన 9493586559
నేరేడ్‌మెట్ ఏఈ ఎన్.గోపాల్ 9490153542
మౌలాలి ఏఈ ఎ.వెంకట్‌రెడ్డి 9490153527

చర్లపల్లి సబ్ డివిజన్ పరిధిలో..
చర్లపల్లి -1 ఏఈ రవీందర్ 8331043125
చర్లపల్లి -2 ఏఈ ఎం.పృథ్వీరాజ్ 9490153552

మల్కాజిగిరి పరిధిలో..
ఏఈ శ్రీనివాసులు : 9490153537
మిర్జాల్‌గూడ ఏఈ ఉమ 9490153540
వసంతపురి పరిధిలోని ఏఈ సుదీప్‌రెడ్డి 9490153543
వినాయక్‌నగర్ ఏఈ సుమా క్రిస్టినా 9490153545

రుణం.. పని తీరే ఆధారం!

- పొదుపు సంఘాలకు ఇకపై గ్రేడింగ్ విధానం
- రెండు జిల్లాల్లో 22,580 స్వయం సహాయక సంఘాలు
- పోటీతత్వం పెంచేందుకు ఉపయుక్తం

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వపరంగా, బ్యాంకుల రుణాలను సకాలంలో చెల్లిస్తున్న వారిలో సింహభాగం మహిళా సంఘాలవే. బ్యాంకు అధికారులు సైతం ఈ పొదుపు సంఘ సభ్యులకు రుణాలు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఈ రంగాన్ని మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రభుత్వం రకరకాల ప్రయోగాలకు రూపకల్పన చేస్తోంది. ఈక్రమంలోనే తాజాగా 'గ్రేడింగ్' విధానం తీసుకొచ్చింది. సంఘాలను మరింత పటిష్టం చేయాలన్న లక్ష్యంతో ఈ విధానం అమలు చేయనున్నారు.

గ్రేడింగ్ ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం 22,580 స్వయం సహాయక మహిళా సంఘాలు ఉండగా 2,43,244 మంది సభ్యులున్నారు. ఇందులో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 3,383 స్వయం సహాయక సంఘాలు ఉండగా 36,553 మంది సభ్యులు ఉన్నారు. అలాగే రంగారెడ్డి జిల్లాలో 19,192 స్వయం సహాయక సంఘాలు ఉండగా 2,06,691 మంది సభ్యులు ఉన్నారు. గ్రేడింగ్ విధానంలో మహిళా సంఘాలకు ఎనిమిది అంశాల ఆధారంగా ఏ, బీ, సీ, డీ గ్రేడ్లు ఇవ్వనున్నారు. ఒక్కో సంఘం 75 శాతానికి పైగా లక్ష్యాలు సాధిస్తే 'ఏ' గ్రేడ్, 60 శాతం కంటే తక్కువ సాధిస్తే 'డీ', అంతకంటే దయనీయంగా ఉంటే 'ఈ' గ్రేడ్‌గా నిర్ణయిస్తారు.



ఇప్పటి వరకు గ్రామైక్య సంఘాలకు మాత్రమే గ్రేడింగ్ విధానం అమలులో ఉంది. ఏ, బీ, సీ గ్రేడింగ్‌ల్లో ఉన్న గ్రామైక్య సంఘాలకే స్త్రీనిధి రుణాలు కేటాయిస్తున్నారు. కాగా, ఇక మీదట క్షేత్రస్థాయిలో స్వయం సహాయక సంఘాలకూ ఇదే నిబంధన వర్తించనుంది. గ్రేడింగ్‌లో వెనకబడితే బ్యాంకు, స్త్రీనిధి రుణాలు పొందటం ఇకపై కష్టమే.

పెరగనున్న అధికారుల పర్యవేక్షణ

గ్రేడింగ్ విధానం అమలులోకి రావటంతో మహిళా సంఘాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెరగనుంది. ఇప్పటికే సమావేశాలకు సంబంధించి లైవ్ ఫొటో తప్పనిసరి చేశారు. అంతేకాకుండా రుణ వాయిదాల రికవరీపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈక్రమంలో తరచూ సమావేశాల నిర్వహిస్తూ రుణాల చెల్లింపులో వెనుకబడిన సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రేడింగ్‌ల్లో ఎప్పుడూ ముందుండేలా సంఘాల వారీగా నివేదికలు తెప్పించుకుని సమీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో సంఘ సభ్యుల్లో పోటీతత్వం అలవడి మరింత సక్రమంగా లావాదేవీల నిర్వహణకు అవకాశం ఉంటోంది.

నిర్దేశించిన అంశాలు..

ప్రతినెలా రెండుసార్లు సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. అంతేకాకుండా సమావేశాలకు పూర్తిస్థాయిలో సభ్యుల హాజరు కావాలి. వీటితో పాటు ప్రతినెలా క్రమం తప్పకుండా పొదుపు చేయడం, అంతర్గత రుణాల చెల్లింపులు, సామాజిక పెట్టుబడి నిధి(సీఐఎస్ఎఫ్) అప్పు కట్టడం, స్త్రీనిధి రుణ వాయిదాలతో పాటు గ్రామ సంఘానికి సంబంధించిన రుణ వాయిదాలతో పాటు బ్యాంకు అప్పు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

జిల్లా కోర్టు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి జిల్లా కోర్టు నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. కోర్టు నిర్మాణ పత్రాలను ఆయన పరిశీలించారు. డిటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్, కాంట్రాక్ట్ అగ్రిమెంట్ కాపీ, చీఫ్ జస్టిస్‌కు అందజేసే కరస్పాండెన్స్ కాపీలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ సారంగపాణి, డీఈ భారతి, ఏఈ రమేష్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ పాల్గొన్నారు.

హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణరెడ్డి


ముత్యాలరావు కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గం

అల్వాల్: నేరేడ్‌మెట్ ముత్యాలరావు కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలు గురువారం డిస్ట్రిక్ట్ సొసైటీ సబ్ రిజిస్టర్ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 15 మంది పోటీ చేయగా సొసైటీ అధ్యక్షుడిగా డి.లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా పి.వేలును ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కె.ఉమేష్, కోశాధికారిగా డి.కృష్ణదేవి, డైరెక్టర్లుగా కె.వెంకటేష్, వై.కొండల్‌రావు, జేకే.జయశ్రీ, డీపీ.రామ్, రాధ, బాలకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ.. ముత్యాలరావు కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.1.60 లక్షలు మంజూరు


ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న మందముల పరమేశ్వర్‌రెడ్డి

మల్లాపూర్: సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. నాచారం డివిజన్ ఎరుకుల బస్తీకి చెందిన మైసమ్మ కుమార్తె జ్యోతి అనారోగ్య సమస్యతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించాలని కాంగ్రెస్ పార్టీ నాచారం డివిజన్ అధ్యక్షుడు బండారం శ్రీకాంత్‌గౌడ్ పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి ఎల్‌ఓసీ ద్వారా రూ.1.60 లక్షలను మంజూరు చేయించారు. ఎల్‌ఓసీ పత్రాన్ని గురువారం వారి కుటుంబ సభ్యులకు మందముల పరమేశ్వర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నూతనకంటి రాజు, ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, అబ్రహం, గద్ద క్రాంతి, శ్రీనివాస్‌రెడ్డి, మునీర్, ప్రవీణ్‌చారి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స కోసం రూ.1.10 లక్షలు

మౌలాలి: మౌలాలి డివిజన్‌కు చెందిన రాణీలావణ్య అనారోగ్యంతో బాధపడుతోంది. సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీకి దరఖాస్తు చేసుకోగా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ రూ.1.10 లక్షల పత్రాన్ని గురువారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి రాణి కుటుంబ సభ్యులకు అందజేశారు.


ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

నాలాను ఆక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలి

బోడుప్పల్: రా చెరువు కింద ఉన్న నాలాను ఆక్రమించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మల్లయ్యనగర్ కాలనీవాసులు కమిషనర్ రామలింగంకు వినతి పత్రం అందజేశారు. కట్టమైసమ్మ వైన్ షాపు వెనుక భాగంలో సాయిదుర్గ కాలనీ పక్కన ఉన్న నాలాను మట్టితో పూడుస్తున్నారన్నారు. నాలా పక్కన ఉన్న స్థలంలో రోడ్డు వేసి స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో మిట్టపల్లి సురేందర్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులున్నారు.

విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయండి

రామంతాపూర్: రామంతాపూర్ ప్రధాన రహదారి కట్టమైసమ్మ దేవాలయం వద్ద కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు బీజేపీ విజయ సంకల్ప యాత్ర చేరుకుంటుందని, 10.15 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పార్టీ అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున సభకు హాజరు కావాలని బీజేపీ రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకటరావు ఒక ప్రకటనలో కోరారు.

నూతన ఆలయంలో ప్రత్యేక పూజలు



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాయంచ కాలనీలో నూతనంగా నిర్మించిన పంచముఖి హనుమాన్, రామాలయం దేవాలయాన్ని గురువారం మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, కార్పొరేటర్లు కొల్లూరి మహేష్,కాడె పోచయ్య, బచ్చరాజు, నాయకులు లేతాకుల రఘుపతిరెడ్డి, బొడిగే కృష్ణ గౌడ్, సత్యనారాయణ, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు స్థలం పేరుతో ఇబ్బందులు


మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన కార్పొరేటర్, కాలనీవాసులు

- 40 ఏళ్ల నుంచి లేఅవుట్‌లో క్రయవిక్రయాలు
- అన్ని అనుమతులు లభించినా తప్పని తిప్పలు
- ప్రభుత్వమే సమస్యకు పరిష్కారం చూపాలి
- మంత్రులకు వినతి అందజేసిన కాలనీవాసులు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో నెలకొన్న వక్ఫ్ బోర్డు సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆర్ఎన్ఎస్ కాలనీ వాసులు మంత్రులు దుద్దిల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 40 ఏళ్ల నుంచి స్థానికంగా చేసిన లేఅవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసి ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టినట్లు వెల్లడించారు. ఇప్పుడు వక్ఫ్ బోర్డు స్థలంగా చూపి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ప్రస్తుతం ఎలాంటి క్రయవిక్రయాలు జరగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీవాసులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పురుషోత్తమరావు, కుంభం శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ, ఆర్‌ఓబీల నిర్మాణానికి చొరవ చూపండి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గంలో ఆర్‌యూబీ, ఆర్‌ఓబీల నిర్మాణానికి చొరవ చూపాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్ విభాగం అధికారులను కోరారు. గురువారం ప్రధాన కార్యాలయంలో ప్రాజెక్ట్ విభాగం నార్త్ జోన్ ఎస్ఈ రవీందర్‌రాజుతో సమావేశమయ్యారు. మల్కాజిగిరి సర్కిల్‌లో వాజుపేయినగర్, గౌతంనగర్, సఫిల్‌గూడ, కాకతీయనగర్, వినాయకనగర్, ఆల్వాల్ సర్కిల్ పరిధిలోని వెంకటాపురం, లయోలా కాలేజీ ప్రాంతాల్లో రైల్వే గేట్ల వద్ద ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారి దృష్టికి తీసుకొనివచ్చారు. ఎంఎంటీఎస్ రెండవ దశలో భాగంగా రైళ్ల ప్రారంభిస్తే ట్రాఫిక్ రద్దీ ఎక్కువవుతుందన్నారు. ఆర్‌కేపురం వద్ద ప్రస్తుతం ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రస్తుత పరిస్థితుల్లో సరిపోవడం లేదని, అదనంగా మరో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వారికి సమస్యను వివరించారు. సమావేశంలో ఈఈలు సురేష్, రాధిక, డీఈలు రాంచందర్, సుదర్శన్, ఏఈ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి ఎక్సైజ్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా చంద్రశేఖర్



మల్కాజిగిరి: మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ స్టేషన్ హౌజ్ అధికారిగా జి.చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మణ్ సింగ్ జహీరాబాద్ అంతరాష్ట్ర చెక్‌పోస్ట్ విభాగానికి బదిలీకాగా ఆయన స్థానంలో పరిగి నుంచి చంద్రశేఖర్ బదిలీ అయ్యారు. మల్కాజిగిరి పీఎస్ పరిధిలో గంజాయి, బెల్ట్ షాపు నిర్వాహకుల సమాచారం ఉంటే అందజేయాలని విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వానరులకు ఆహారం



గౌతంనగర్: సేవ్ మంకీస్ నినాదంతో మల్కాజిగిరి గౌతంనగర్‌కు చెందిన మానవసేవే మాధవసేవ వాట్సాప్ గ్రూప్ సభ్యుల సహకారంతో గ్రూప్ అడ్మిన్ కుమ్మరి రాజు ఆధ్వర్యంలో గురువారం నర్సాపూర్ అడవిలో వానరులకు అరటి పండ్లు, బ్రెడ్లు, ఆహారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రూప్ అడ్మిన్ కుమ్మరి రాజు మాట్లాడుతూ.. అడవుల్లో వానరులకు ఆహారం అందక పట్టణాల వైపు వచ్చి ప్రాణాలు కోల్పోతున్నాయన్నారు. గ్రూప్ సభ్యుల సహకారంతో ప్రతినెలా ఒక రోజు నర్సాపూర్ అడవిలో వానరులకు ఆహారం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు వెంకటరమణ, ఆకాష్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలను తొలగించి చెరువులను కాపాడతాం


ఉప్పల్ నల్ల చెరువు వద్ద ఆక్రమణలను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు

ఉప్పల్: సర్కిల్ పరిధిలోని చెరువులను ఆక్రమిస్తే సహించేది లేదని, వారు ఎంతటి వారైనా సమగ్ర సర్వే చేసి కబ్జాలను తొలగించి చెరువులను కాపాడతామని ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటరమణతో కలిసి ఉప్పల్ నల్ల చెరువును సందర్శించారు. అన్ని ప్రభుత్వ విభాగాల సమన్వయంతో చెరువులను సంరక్షించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. చాలా వరకు నల్ల చెరువు పరిసర ప్రాంతాలు, బఫర్ జోన్లు కనుమరుగైనట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. సరైన ఆధారాలతో రిపోర్టులు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని డీసీ తెలిపారు.

అనాథలకు చేయూత అందించాలి



బోడుప్పల్: అనాథలకు తమవంతు చేయూత అందించాలని బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్ పిలుపునిచ్చారు. ఆమె పెళ్లి రోజు సందర్భంగా స్థానికంగా ఉన్న అమ్మ ఆశ్రమం, కరుణ రథం ఆశ్రమంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు అనాథలకు తమవంతు తోచిన సాయం అందించాలన్నారు. అనాథ ఆశ్రమంలో అన్నదానం చేయడం తనకు ఎంతో తృప్తి ఇచ్చిందన్నారు. ప్రతి సంవత్సరం తమవంతు సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

జల్సాలకు అలవాటుపడి..

- ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ముఠా
- ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు
- పరారీలో మరో ఇద్దరు నిందితులు
- 32 తులాల ఆభరణాలు స్వాధీనం

అల్వాల్: జల్సాలకు అలవాటు పడి ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ముఠాను అల్వాల్ పోలీసులు అరెస్టు చేశారు. అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు మాట్లాడుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను అరెస్టు చేశామన్నారు. వారివద్ద నుంచి దాదాపు 36 తులాల బంగారం, 4 కేజీల వెండి ఆభరణాలతో పాటు ఒక ల్యాప్‌టాప్, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మత్తు పదార్థాలతో పాటు జల్సాలకు అలవాటు పడి చోరీ చేస్తున్న ముఠా సభ్యులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

పరారీలో మరో ఇద్దరు..

సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ ప్రాంతాలకు చెందిన వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ ముఠా చోరీలకు పాల్పడినట్లు ఏసీపీ వివరించారు. నేరేడ్‌మెట్ ప్రాంతానికి చెందిన బండ విజయ్‌కుమార్(28) ఇంటీరియర్ పనితో పాటు పెయింటర్. కుషాయిగూడ ప్రాంతంలో నివసించే సురాసుర క్రిష్ణవంశీ(26) ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అల్వాల్ ప్రాంతానికి చెందిన మరో నిందితుడు చిగుర్ల సతీష్(30) కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. వీరితో పాటు పరారీలో ఉన్న మరో ఇద్దరు తేజ, శ్రవణ్‌ను పోలీసులు నిందితులుగా గుర్తించారు.


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నాలుగు నెలలుగా పరిచయం..

ప్రధాన నిందితులు విజయ్‌కుమార్, క్రిష్ణవంశీ, సతీష్‌లు దాదాపు నాలుగు నెలల క్రితం పరిచయం అయిన నేపథ్యంలో మత్తు పదార్థాలతో పాటు జల్సాలకు అలవాటు పడ్డారు. ఆ విధంగా వీళ్లంతా ఓ ప్లాన్ ప్రకారం అద్దెకు కారు తీసుకొని దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇంటీరియర్ అయిన విజయ్‌కుమార్ గతంలో అమెజాన్‌లో పనిచేసిన క్రిష్ణవంశీకి వివిధ ప్రాంతాలకు చెందిన కాలనీల మీద పూర్తి పట్టు ఉన్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది. డ్రైవర్ అయిన సతీష్ అద్దెకు తీసుకున్న కారును చోరీ చేయాలనుకున్న ఇంటికి చాలా దూరంలో పెట్టడం, ముందుగా వేసుకున్న రెక్కీ ప్రకారం మిగతా ఇద్దరు తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకొని డోర్ కట్టర్‌తో లాక్‌లు కట్‌చేసే వారు. కుషాయిగూడ, చర్లపల్లి, జవహర్‌నగర్, అల్వాల్ ప్రాంతాల్లో మొత్తం ఐదు ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో వెల్లడించారు.

అదుపులోకి తీసుకుని విచారించగా..

ఈ నెల 21న అల్వాల్ పట్టణ పరిధిలో మచ్చ బొల్లారం ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అనుమానస్పద స్థితిలో కారులో ప్రయాణిస్తున్న విజయ్‌కుమార్, క్రిష్ణవంశీ, సతీష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ముఠా దొంగతనాలు బయట పడ్డాయని ఏసీపీ రాములు వివరించారు. దాదాపు 32 తులాల బంగారు ఆభరణాలు, దాదాపు 4 కేజీల వెండి ఆభరణాలు, ఒక ల్యాప్‌ట్యాప్‌తో పాటు కారును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. డీసీపీ నర్సింహారావు పర్యవేక్షణలో అల్వాల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్ ఆధ్వర్యంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కుమార్ కేసును దర్యాప్తు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్, డీఐ ప్రమోద్‌కుమార్ తదితరులను అభినందిచారు.

ఇలాంటి ఘటన పునరావృతమైతే కఠిన చర్యలు

కుషాయిగూడ ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించిన డీఎంహెచ్ఓ

కుషాయిగూడ: కుషాయిగూడ ఆరోగ్య ఉపకేంద్రం అద్దె బాగోతం కథనాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. మేడ్చల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రఘునాథ్ స్వామి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి కుషాయిగూడ ఆరోగ్య ఉప కేంద్రాన్ని గురువారం సందర్శించారు. వార్త ప్రతికల్లో వచ్చిన కథనాలపై విచారణ చేపట్టారు. ఉప కేంద్రం సిబ్బందిని మందలించి మెమోలు జారీ చేశారు. తిరిగి ఇలాంటి ఘటన పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్రంలోని గదిలోని కుండలతో పాటు సామగ్రిని తొలగించారు. అలాగే పార్కింగ్ స్థలంలో ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయాలను అక్కడి నుంచి తొలగించారు. ఉప కేంద్రంలో పల్లె దవాఖానాను ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ రమాదేవి, హెచ్ఈఓ శ్యాంసుందర్, ఏఎన్ఎం మహేశ్వరి, వరలక్ష్మీ, స్థానిక నేతలు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతారాంరెడ్డి, పాండాల శివకుమార్‌గౌడ్, బత్తుల శ్రీకాంత్‌యాదవ్, బాల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.


డీఎంహెచ్ఓ డాక్టర్ రఘునాథ్ స్వామి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అల్వాల్: సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ ఐసీటీ సెల్ ఏసీపీ నరేందర్ అన్నారు. షేర్ అంబ్రెల్లా ట్రస్ట్ ఆధ్వర్యంలో నేరేడ్‌మెట్ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శైలజ అధ్యక్షతన సైబర్ మోసాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ ఐసీటీ సెల్ ఏసీపీ నరేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులు మొబైల్ ఫోన్లను మంచి పనులకే వాడాలన్నారు. సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శైలజ, షేర్ అంబ్రెల్లా ట్రస్ట్ చైర్మన్ ఫౌండర్ విజయ అర్చన, ఎస్ఐ శ్రీనివాస్, కో–ఆర్డినేటర్ చంద్రలేఖ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్స్ డాక్టర్ జగన్, మల్లికా, డాక్టర్ రచన, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


నేరేడ్‌మెట్ ప్రభుత్వ కళాశాలలో..

ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష



కుషాయిగూడ: డివిజన్‌లో పెండింగ్ ఉన్న అభివృద్ధి పనులపై కార్పొరేటర్ బొంతు శ్రీదేవి గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్లపల్లి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే డివిజన్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఇంజినీరింగ్ ఈఈ హరిలాల్, ఏఈ కీర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కాంగ్రెస్ కార్యకర్తకు చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. కుషాయిగూడకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త మల్లికార్జున్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లో ఉంటూ చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పార్టీ డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం మల్లికార్జున్ నివాసంలో ఆయనను కలిసి ఆర్థికసాయం అందజేశారు. మెరుగైన వైద్య సాయం అందేలా చూస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల్‌యాదవ్, లింగంనాయక్, హీరాలాల్ తదితరులు పాల్గొన్నారు.